# నివురు

"మదర్ ఎక్స్‌పైర్‌డ్. స్టార్ట్, ఇమీడియట్లీ"

టెలిగ్రాం చదివాడు ధర్మరాజు. టెలిగ్రాం కాయితం మీద టైము, డేటు చూశాడు. నిన్న అంటే 29 జూన్ 2000న రాత్రి పది గంటలకు అన్న శ్రీధరస్వామి ఇచ్చిన టెలిగ్రాం అది. "ఫోను చెయ్యొచ్చుగా తనకి" అనుకుని, "ఆయనకు తన ఫోను నెంబరు తెలీదుగా" అని సమాధానపడ్డాడు ధర్మరాజు.

బయట జోరున వానపడుతోంది. భార్య సుగుణను పిల్చాడు. టెలిగ్రాం ఆమెకిచ్చాడు.

"ఏమిటి?" అంది ఆమె, టేబుల్ మీద కళ్ళజోడుకోసం వెతుకుతూ.

"అమ్మ పోయిందట. వెళ్ళాలా వద్దా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు ధర్మరాజు.

"వెళ్ళకపోవటమేం? పదండి. నేనూ వస్తాను. బతికుండగా ఒక్కసారే చూశానామెను. పోయినప్పుడయినా చూడకపోతే మనసులో వెలితి మిగిలిపోతుంది. పిల్లలెలాగో అమెరికాలో సెటిలయ్యారు. కర్మ అయిందాకా అక్కడే ఉందాం. ఇదే మొదటిసారీ, చివరిసారీ అవుతుంది అత్తగారింటికి వెళ్ళటం."

"మీ అత్త లేదక్కడ. మా అన్నయ్య ఉన్నాడు."

"పోనీ బావగారింట్లోనే ఉందాం."

"ఆయనకేమన్నా అభ్యంతరమేమో నాకు తెలీదు."

"పోన్లేండి. దేవాలయ సత్రంలో ఉందాం. లేకపోతే మా అన్నయ్య ఇంట్లో ఉందాం."

"నేను చెయ్యాల్సిందేమీ లేదు అక్కడ. అన్నయ్య మరెందుకు టెలిగ్రాం ఇచ్చాడో!"

"అనవసరపు సందేహాలు వదిలేసి బయలుదేరండి. కడసారిగా ఆమెను చూడనయినా చూడొచ్చుగా!" అని వెళ్ళి వెంటనే ఓ సూటుకేసులో ఇద్దరి బట్టలూ సర్దేసింది.

ఇమ్లిబన్ బస్టాండుకు వెళ్ళిన అరగంటకు ధర్మపురి వెళ్ళే బస్సు దొరికింది.

'కడసారి తనెప్పుడు ఆమెను చూశాడు?' ప్రశ్న వేసుకున్నాడు ధర్మరాజు బస్సులో కూర్చున్నాక. అదేం కష్టంకాదు. 15 ఆగస్టు 1947న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఆనాడే తను అరెస్టు అయింది. ఇవాళ 30 జూన్ 2000. అంటే తనామెని చివరిసారిగా చూసింది యాభై రెండేళ్ళ, పది నెల్ల, పదిహేను రోజులకు ముందు. ఇప్పుడు తనకు డైబ్బై ఏళ్ళు దాటాయి. తనకు ఏడేళ్ళ వయసులో ఆమె సంరక్షణ నుండి తను బయటపడ్డాడు. ఆ తర్వాత 15 ఆగస్టు 1947నే చూడటం. మళ్ళీ కళ్ళు మూసిన తర్వాత ఇప్పుడు. ఒకప్పుడు తల్లి అంటే తనకు అసహ్యం, కోపం. తరవాత ఎన్నో ఏళ్ళకుగాని ఆమె నర్థంచేసుకోలేకపోయాడు. ఆమెకు మనసు విప్పి చెప్పుకోలేని పంతం. తన్నెప్పుడో క్షమించేసింది ఆమె. తనకు తెల్సు. అయినా ఇద్దరిమధ్యా మాటలేవు. చూపుల్లేవు.

తన బాల్యం, యవ్వనం, జీవితం స్ఫురణకొచ్చింది ధర్మరాజుకు.

★ ★ ★

తల్లీ కొడుకుల మధ్య వైరం అతను పుట్టకముందే మొదలైంది. అతని తండ్రి ధనంజయాచార్యులు. తల్లి అలివేలు మంగమ్మ. ఆయన ఓ సామాన్య కుటుంబీకుడు, పండితుడు, ఆచార్య పురుషుడు. కరీంనగర్‌జిల్లా ధర్మపురి దేశ్‌ముఖ్ కేశవరావుగారి హయాంలో ధనంజయాచార్యుల తండ్రి వేదాల రఘునాథాచార్యులను తన ఊరికి పిలిపించాడు. పండితుడు, ఆచార్యుడు అయిన ఆయన ఊరి జనానికి ధర్మబోధచేస్తాడని ఊళ్ళో నివాసం ఏర్పరచి ఓ రెండెకరాల భూమిని కూడా ఈనాంగా ఇచ్చాడు. ఆయన జీవితం ధర్మబోధలో, శిష్య సంచారంతో హాయిగా గడిచిపోయింది. ఆయనకు ఇద్దరు కొడుకులు. ధనంజయాచార్యులు కాక ఆయనకు యాభై ఏళ్ళ వయసులో పుట్టిన వేంకటాచార్యులు. వేంకటాచార్యులు పుట్టిన ఐదేళ్ళకు రఘునాథాచార్యులు, ఆయన భార్యా ఒకటి రెండు నెలల తేడాతో పోయారు. పిల్లవాడి పెంపకపు భారం కొత్తగా పెళ్ళయి వచ్చిన కోడలు అలివేలు పైబడింది. మరిది పెంపకాన్ని ఆమె భారంగా భావించలేదు. అతన్ని కొడుకుగానే పెంచి పెద్ద చేసింది. ధనంజయాచార్యులూ పండితుడు. శిష్యసంచారం వదలిపెట్టలేదు.

దొర కేశవరావు పోయాక ఊరి పెత్తనం ఆయన కొడుకు రామభూపాలరావుకు సంక్రమించింది. నిజాం రాష్ట్రంలోని దేశముఖుల, జమీందార్ల, జాగీరుదార్ల దౌష్ట్యమంతా జీర్ణించుకున్న మనిషి అతను. ఊరి దొరకు, వచ్చే ప్రభుత్వాధికార్లకు అన్ని కులాలవారూ వెట్టిచాకిరీ చేయకతప్పదు. అధికార్లు వచ్చినప్పుడు హరిజనులు బరువులు మొయ్యాలి, కచ్చడం వెనుకాముందూ పరిగెత్తాలి. బందిలదొడ్డికి కాపలా ఉండాలి. కట్టెలు తెచ్చిపెట్టాలి. చాకళ్ళు బట్టలు ఉతకాలి. పడుకోటానికి పక్కలు సిద్ధంచెయ్యాలి. కుమ్మర్లు కుండలు ఇవ్వటమేకాక, వంటకూడా చెయ్యాలి. మంగళ్ళు క్షవరం చేయటమేకాదు, గడిలో దీపాలు తుడిచి వెలిగించాలి. దొరల కాళ్ళు పట్టాలి. కురుమలు గొర్రెలు, మేకలు ఇవ్వాలి. కోమటాయన అవసరమైన సరుకులన్నీ ఇవ్వాలి. దొరలు అగ్రవర్ణమైన బ్రాహ్మల్ని కూడా వదిలేవాళ్ళు కారు. సంవత్సరానికి అవసరమైన విస్తళ్ళు కుట్టి అందివ్వాలి. శుభాశుభాలు తెలియజెప్పాలి. పౌరోహిత్యం చెయ్యాలి. ఇవేకాక ప్రజల్నుండి షాదీ పట్టీ, ఝూలా పట్టీ, సత్తెమ్మ పట్టీ వగైరాలను బలవంతంగా వసూలుచేసేవారు. దొర ఇంట్లో పెళ్ళైనా పేరంటమైనా, చావైనా, ఏమైనా పట్టీల రూపంలో నజరానాలు తప్పవు. వీటిలో ఏ సేవలు అందకపోయినా, దొరలు అధికార్లు, పోలీసుల జులుం మహాభయంకరంగా ఉండేది. రామభూపాలరావు కాలంలో ఇవన్నీ మహాదుష్ట రూపంలో ధర్మపురిలో అవతరించాయి. ప్రజలపై ఈ పీడనాన్ని ధనంజయాచార్యులు సహించలేకపోయాడు. "పరపీడనం వినాశనానికి హేతువు. మీకు మంచిది కాదు" అని ఆయన ఒకటి రెండుసార్లు దొరని హెచ్చరించాడు. కానీ, రామభూపాలరావు దొర తన కప్రియమైన మాటలు వినేటటువంటి వాడు కాదు. పైగా ఆ చెప్పిన వ్యక్తిపై కినుక పెంచుకునేవాడు. సమయం వచ్చినప్పుడు సాధించేవాడు.

ఓసారి ఓ హరిజనుడు బేగారి పనులకు రాలేదని, "పెయ్యమంచిగలేదు. బీమారుంటి. నీ కాల్మొక్త. బాంచెను" అని మొత్తుకున్నా వినకుండా, వేసవి మండుటెండలో పొద్దుటినుండి సాయంత్రందాకా వీపుమీద బండ ఎత్తించాడు. ఆ ముసలివాడు రాత్రల్లా

విపరీతమైన జ్వరంతో తీసుకుని మర్నాటికల్లా చనిపోయాడు. అది విన్న ధనంజయా చార్యులు దొర గడీకి వచ్చి చెప్పాడు.

"నువ్విలా జనాన్ని చంపటం, వాళ్ళను మనుషులుగా బతకనీయకపోవటం ఆ శ్రియఃపతి చూడకుండా ఉండదు. ఆ బడుగుల ఉసురు నీకు కొట్టకపోదు. నా మాట విని ఇప్పటికైనా నీ పద్ధతులు మార్చుకో" అని.

"అయ్యోరూ. మీరన్నింటికీ ఇట్టా కల్పించుకోటం బాగులేదు. మీ పని మీరు చూసుకోండి" అన్నాడు ఆవలిస్తూ రామభూపాలరావు దొర.

"నేను చేసేది నా పనే. ధర్మబోధ చేయటమే నావృత్తి."

"మరింకేం? ఆ పనే చేసుకుని బతకండి. మేమిచ్చిన భూమిమీద ఇకమీదట మీకేం జోక్యం ఉండబోదు. ఇంకెళ్ళండి."

"అందుకు నాకు దిగులు లేదు. భూములు ఉంటాయి పోతాయి. ఆ శ్రియఃపతి కరుణ ఉంటే చాలు."

అలివేలు పొలం చేజారిపోయిందని బాధపడలేదు. భర్తపై అంత విశ్వాసం ఆమెకు.

మరిది వేంకటాచార్యులు ఇంటికొచ్చి అన్నగారి నిర్వాకాన్ని గూర్చి వదినకు చెప్పి, "అన్నకు అనవసరమైందిలేదు. అన్నింట్లోతనే ఉన్నానంటాడు. దొరతో పంతమెందుకు? ఇప్పుడేమాయె! ఉన్న పొలం దొర లాక్కునె! మన బతుకుడెట్టా?" అన్నప్పుడు మాత్రం ఆమెకు బాగా కష్టమేసింది.

"మామ పోయినప్పటినుండి నిన్ను సాకి పెంచిన అన్న చేతల్లోనే నీకు తప్పులు కనబడుతున్నయ్యా? ఆయన్నేమీ అనకు. మంచిగుండదు" అంది అలివేలు మరిదిని కసురుకుంటూ.

"అన్నిట్లుంటే నాకు కుదర్దు వదినమ్మా. నేనూ, నా పెండ్లాం వేరుంటాం. అన్నకు చెప్పు" అన్నాడు అతనూ దుర్రుసుగా.

"నీకంత కష్టంగుంటే అట్లనేవుండు."

ధనంజయాచార్యులు భార్య చెప్పిన మాట విని బాధపడ్డాడు. తమ్ముడు చెప్పినా విన డని ఆయనకు తెల్సు. ఎప్పుడూ దొర గడీలోనే ఉండి అతను చేసే దుర్మార్గాలకు చేయూత నిస్తున్నాడని తెల్సి ఆయన రెండు మూడుసార్లు మందలించాడు. అన్నకు బదులేం చెప్పక పోయినా అతను తన పనిమానుకోలేదు.

దొర సాయంతో వేంకటాచార్యులు ఓ చిన్న ఇల్లు కట్టుకున్నాడు. అన్న నుండి తీసుకున్న భూమిని దొరవారు తమ్ముడికిచ్చాడు. అది విన్న అలివేలు భగ్గున మండి పోయింది. "వీడు బాగుపడ్డు. అన్న నోటి దగ్గర ముద్దని తన్నుకెళ్ళినవాడు నాశనమవు తాడు" అని ఆశీర్వదించింది ఆమె. ఓసారి ఓ వ్యక్తిమీద కోపంవస్తే ఆమె అది తన జన్మంతా మర్చిపోదు. జీవితకాలంలో మళ్ళీ ఆ వ్యక్తిని దరికి చేరనీయదు ఆమె. అది అమె తత్త్వం.

ధనంజయాచార్యులకు ఒకడే కొడుకు శ్రీధరస్వామి. ఆ తర్వాత పదేళ్ళకుగాని ఆమె గర్భం ధరించలేదు. ధర్మరాజు కడుపులో పడేటప్పటికే ఆ ఇంట్లో కష్టాలు మొదలయ్యాయి. శిష్యులు గురువుమీద ఆదరంకొద్దీ ఇచ్చే డబ్బు, సామాన్లతో జీవనం గడవటం కష్ట మయింది. అలివేలు ఆరోగ్యం కూడా బాగా పాడయిపోయింది. పక్క ఊరి ధన్వంతరి గారి దగ్గర మందులు తెచ్చి వాడాడు ధనంజయాచార్యులు. ఒకటే నీరసం, మనిషి పాలిపోయింది. జబ్బేదో నిర్ధారణ కాలేదు. ఆమె బతికి బట్టకడుతుందని ఎవరూ అను కోలేదు. అయితే, ధన్వంతరిగారి వైద్య ప్రభావమో, లేక వాళ్ళనుకున్నట్లు ఆ శ్రియఃపతి కరుణో ఆమెకు నెమ్మదించింది. ఆ సమయంలోనే ధనంజయాచార్యులు మరణించాడు. పొద్దున పడుకున్నవాడు మరిలేవలేదు. హృద్రోగంతో మరణించాడని ధన్వంతరి అన్నాడు. మరణంలోనూ ఆయన జీవనంలోని ప్రశాంతత వీడలేదు. అప్పుడు అలివేలు నిండు గర్భిణి. భర్త మరణానికి కుమిలిపోతూ కడుపుమీద కొట్టుకుని కొట్టుకుని ఏడ్చింది ఆమె. భర్త పోయిన నెల రోజులకు పుట్టిన ధర్మరాజు అంటే ఆమెకు విపరీతమైన ఏవగింపు, ద్వేషం కలిగాయి. తండ్రి గండాన పుట్టాడని వాళ్ళూ వీళ్ళూ అన్న మాటలు కూడా కన్న కొడుకుపై ద్వేషాన్నే పెంచాయి కానీ, మమకారాన్ని పెంచలేదు. ఆమె ఆ పిల్లవాడిని పెంచలేదు. అతనే పెరిగాడు, ఇంటి పెరడులో పెరిగిన కలుపుమొక్కలా.

అన్న పోయినప్పుడు వేంకటాచార్యులు వాళ్ళని ఆదుకోటానికి వచ్చాడు కానీ అలివేలు అరిచి గోలచేసి అతన్ని అన్న శవం దగ్గరకే రానీలేదు. "నువ్వు ఘాతకుడివి. కృతఘ్నుడివి. ఆయన శరీరాన్ని ముట్టుకుని ఆయన్ని మళ్ళీ చంపకు. ఛో, నీ ముఖం నాకు చూపించకు" అని తిట్టిపోసింది. చుట్టుపక్కల వాళ్ళు ఆమెకు నచ్చచెప్ప చూశారు. కానీ ఆమె వాళ్ళ మాటలు చెవిన పెట్టలేదు. పిచ్చిదానిలా అరిచింది.

పెద్దకొడుకు శ్రీధరస్వామి మనసులో కూడా ఆమె పినతండ్రి పట్ల ద్వేషం పెంచింది. తనకొచ్చిన చదువు పూర్తిగా కొడుక్కు చెప్పకుండానే చనిపోయాడు ధనంజయాచార్యులు. పదేళ్ళ పిల్లవాడు శ్రీధరస్వామి. ఆ చిన్నవయసులో బతకడమెట్లాగో తెలియని అతని భుజ స్కంధాలపై కుటుంబభారం పడింది. అలివేలు వైపువాళ్ళు కూడా ఎవరూ వచ్చి వాళ్ళకు సాయపడలేదు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి కోవెల పూజారుల దయతో పౌరోహిత్యానికి కావాల్సిన మంత్రాలు నేర్చుకున్నాడు. దేవాలయానికి, గోదావరిలో స్నానం చేయటానికీ వచ్చే భక్తులిచ్చే తృణఫణాలకి, యాయవారం జోడించి అతను తల్లినీ, తమ్ముడినీ పోషించ సాగాడు.

ధర్మరాజు ఏడేళ్ళవాడయ్యాడు. తల్లి ప్రేమ, వాత్సల్యాలు అతనెప్పుడూ ఎరగడు. చిన్నతనంవల్ల పిల్లవాడు ఏమాత్రం పొరపాటు చేసినా ఆమె అతని వళ్ళు వాయగొట్టేది. తల్లి అంటే విపరీతమైన భయం, ద్వేషం ఏర్పడ్డాయి అతని ఆ చిన్నమనసులో. అయినా తల్లి ఏం చెప్పినా చేయక తప్పదు. ఎవడి బతుకు వాడిదయినా, ఊరు పెత్తాందారుకు వెట్టి చేయక ఏ కులపువాళ్ళకూ తప్పదు. దొరగారింటి నుండి ఆడ బాపడు వచ్చి చెప్పాడు.

"దొరింటికి చుట్టాలొస్తున్నారంట. పత్రోలి (విస్తళ్ళు) మీసంది పంపమన్నాడు."

"మోదుగాకుల్లేవు. తోరణం ఆకుల్తో కుట్టిస్తాను" అంది అలివేలు.

"పచ్చాకులు దొరుకుతుండె. మోదుగాకుల్తో కుట్టమన్నది దొరసాని."

"ఇంట్లో ఆకులు తెచ్చేటోళ్ళు ఎవరూ లేరు. ఆకులు తెచ్చివ్వరాదు, కుట్టిస్తాను."

"దొర బేగి రమ్మనె. మస్తు పనులున్నయి గడిల" అంటూ ఆడ బాపడు ఉరుకు పరుగుల మీద వెళ్ళాడు.

పెద్దకొడుకు శ్రీధరస్వామి కోవెలకు వెళ్ళాడు. ఏడేళ్ళ చిన్నకొడుకు ఆకులు తేగలడా అని సందేహించింది అలివేలు. అయినా తండ్రిని చంపి పుట్టిన వెధవ ఆ మాత్రం చేయలేడా అనుకుంది ఆమె.

"అరేయ్, దెష్టముఖమా, ఇట్రా" అని పిల్చింది ఆమె చిన్నకొడుకును.

నిజానికి ఆ పిల్లవాడికి ఏడేళ్ళొచ్చినా తల్లి పేరుపెట్టలేదు. ఎప్పుడు పిల్లవాడిని పిలవాలన్నా ఆమె అలాగే 'నష్ట జాతకుడనో, జేష్ఠ పెద్దమ్మనో' అతన్ని సంబోధించేది.

పిల్లవాడు వచ్చాడు. భయంభయంగా తల్లివంక చూస్తూ నిలబడ్డాడు.

"పత్రోలి కుట్టాలి. మోదుగాకులు తెస్తవా?"

"అట్టనే" అని తల ఊపాడు పిల్లవాడు.

ఆమె అతనికి ఓ గన్నీ సంచీ, గైకత్తీ ఇచ్చి "బేగి, రా" అంది అన్నతోపాటు వెళ్ళి మోదుగాకులు తెంపుకు రావటం పిల్లవాడికి అలవాటే. కొడుకును పంపిన రెండు గంటలకు గానీ వాడు రాలేదు. 'ఎక్కడ చచ్చాడో వెధవ. సమయానికి పత్రోలి ఇవ్వకపోతే దొరతో తంటా వస్తాది' అని భయపడిపోతూ ఆమె పిల్లవాడికోసం ఎదురు చూడసాగింది. 'నష్టజాతకం వెధవ. వాడెళ్ళేటప్పటికి ఆ చెట్లే ఎండిపోయ్యాయేమో' అనుకుంది, అపరాహ్నమైంది. ఆడబాపడు వచ్చి పత్రోలికోసం ఆమె గొంతుమీద కూర్చున్నాడు. అప్పుడు వచ్చాడు ఆ నష్టజాతకుడు. భుజాన ఆకులు నింపిన సంచీని మొయ్యలేక మోస్తూ, ఏడ్చుకుంటూ. ఆమె అసలే కోపంగా ఉంది. పిల్లవాడి ఏడుపు ముఖం చూడగానే ఆమెకు చిర్రెత్తుకొచ్చింది.

పిల్లవాడు రాగానే "ఎక్కడ చచ్చినవురా ఇంతసేపూ? నిన్ను అంపి ఏవారయింది" అంటూ ఆమె చింత బరికతో ఉతకసాగింది.

భర్త బతికున్నప్పుడు ఈ వెట్టిచాకిరీ ఉండేది కాదు. ఆర్థిక పరిస్థితీ ఇంత దౌర్భాగ్యంగా ఉండేదికాదు. అన్నింటికీ పిల్లవాడే కారణమన్న భావనతో కొట్టసాగింది. పిల్లవాడు ఏడుస్తూ వీధిలోకి పరుగెత్తాడు. ఆమె వాడి వెంటపడింది. వీధిలో పోతున్న వేంకటాచార్యులు అది చూసి, "ఎందుకమ్మా, వాడినట్లా చెండుకు తింటున్నావు?" అని అడిగాడు పిల్లవాడిని దగ్గరకు తీసుకుంటూ.

"నీకనవసరం వాడిని వదులు" అంది అలివేలు రొప్పుతూ.

"కొమ్మమీదనుండి పడ్డాను. దెబ్బతగిలింది. ఆలస్యమయింది" అని వెక్కుతూ చెప్పాడు పిల్లవాడు. అతని మోచెయ్యి చీరుకుపోయి, గాయంనుండి రక్తం కారుతోంది. ఆమె మరిది నుండి పిల్లవాడిని లాక్కోటానికి ముందుకు వచ్చింది.

"వద్దు. బాబయ్యా. అమ్మ చంపేస్తది" అన్నాడు పిల్లవాడు భయంతో వణికిపోతూ, పినతండ్రికి కరుచుకుపోతూ.

వేంకటాచార్యులకు పిల్లలు లేరు. ఆ పిల్లవాణ్ణి వదిన అలా హింసించటం చూసిన అతని మనసు ఆగలేదు.

"నీకంత కష్టంగా ఉంటే వీడిని తీసుకు వెళ్ళి నేను పెంచుకుంటాలే. వాడిని చంపకు" అన్నాడు.

"నువ్వెవడివి, నా కొడుకుని పెంచెటందుకు?"

"పిల్లవాడి పినతండ్రిని. పంచాయితీ చేసుకో పో. ఏ తల్లీ నీలాగా పిల్లల్ని హింసించదు. నువ్వు తల్లివి కాదు రాకాసివి" అంటూ పిల్లవాడిని తీసుకుని వెళ్ళిపోయాడు వేంకటాచార్యులు.

ఇంటికి తిరిగొచ్చిన అలివేలు మరిదిని శాపనార్థాలు పెడ్తూ, పక్కింటి గోవర్ధనమ్మను పిల్చి, ఆమె సాయంతో విస్తళ్ళు కుట్టి ఆడ బాపడిని పంపేసింది. అయితే, ఆమె అంతటితో ఊరుకోలేదు. పెద్దకొడుకు శ్రీధరస్వామి రాగానే, పినతండ్రి దౌష్ట్యాన్ని గురించి వివరించి, దొరకు ఫిర్యాదు చేయించింది.

"మీ పిన్నాయన మీ తమ్ముణ్ణి తీసుకెళ్ళిండా? అయితే. ఏంటంటవయ్యా! మీయమ్మ పిల్లగాణ్ణి మంచిగ సాకటంలేదంట. పిల్లగాణ్ణి చెండుకు తింటుందంట. అందుకనే మీ పిన్నాయన ఆడిని పెంచుకుంటానన్జెప్పి తీసుకెళ్ళిండు. తిన తిండి లేదు. పిల్లగాడిని పిన్నాయన ఎత్తుకెళ్ళినాడని రోషమెందుకయ్యా? దొర చెప్పిండని చెప్పు మీయమ్మకు. ఆ పోరగాడు ఆడనే వెంకటాచార్యులు తానుంటాడు" అని పంచాయితీ తీర్పు చెప్పాడు దొర రామభూపాలరావు.

అలా అలివేలుకు చిన్న కొడుకుతో తెగతెంపులయ్యాయి. వేంకటాచార్యులకెప్పుడూ అన్న బతకనేర్చినవాడు కాడన్న జాలి ఉండేది. ఆయన పాండిత్యం పట్ల గౌరవం ఉండేది. ధర్మాత్ముడన్న మన్నింపు ఉండేది. తన్ను పెంచి పెద్ద చేసిన వాడన్న కృతజ్ఞత ఉండేది. తనకు అన్న అన్న మమకారం ఉండేది. అయితే అవన్నీ తన బతుకుకు అడ్డంకులయ్యాయి. అందుకే అన్న నుండి వేరుపడిపోయాడు. తన బతుకుకోసం ఎవరిని ఆశ్రయించినా, ఏ పాడు పనులు చేసినా అన్న కొడుకును ఉద్ధరించాలన్న తపన అతనిలో ఉంది. పిల్లవాడికి ఉపనయనం చేసి తనే ధర్మరాజశర్మ అన్న పేరు పెట్టాడు. ఎవరో చెప్పగా విని హైదరాబాదు సీతారాంబాగులో ఉన్న సంస్కృత పాఠశాలలో చేర్పించాడు. పాఠశాల స్వామివారే భోజన, వసతి సౌకర్యాలు కల్పించి ఉచితంగా విద్యాబోధ చేస్తారు. ఆ తర్వాత ఏడాదికొకసారి పిల్లవాడిని ఊరుకు తీసుకు వచ్చేవాడు. ధర్మపురిలోనూ అలాంటి పాఠశాలే ఉంది. అయితే పిల్లవాడిని ఆ పరిసరాలనుండి దూరంగా తీసుకువెళ్తేనే మంచిదన్న అభిప్రాయంతో వేంకటాచార్యులు ఆ పని చేశాడు.

తల్లి భయం నుండి బయటపడిన ధర్మరాజు చదువులో చురుకుదనం చూపాడు. పద్ధెనిమిదేళ్ళకే విద్వాన్ పరీక్ష పాసయాడు. అయితే ఆ సాంప్రదాయపు చదువు అతన్ని

కట్టిపడవేయలేకపోయింది. 1921లో తెలంగాణలో ప్రజా చైతన్యాన్ని మేల్కొల్పే ప్రయత్నంగా ప్రారంభమైన ఆంధ్ర జనసంఘం ఆంధ్ర మహాసభ అయింది. 1930-40లలో సభా నాయకులు మితవాద, అతివాద వర్గాలుగా చీలిపోయారు. మితవాదవర్గం కాంగ్రెస్ పార్టీ ఆశయాలతో పనిచెయ్యసాగింది. అతివాదులు కమ్యూనిస్టులు. 1945లో ధర్మరాజుకు హైదరాబాదులో కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడితో పరిచయం కలిగింది. అతను ఉద్యోగ ప్రయత్నంలో ఓ స్కూలు కరస్పాండెంటు గారిని కలవటానికి వెళ్తూంటే సుల్తాను బజారులో తన ఊరివాడు ఆదినారాయణ కన్పించాడు. అతను తన ఈడువాడే. పరుగెత్తుకుంటూ వెళ్ళి అతన్ని కలిశాడు.

"ఏందిట్ల వచ్చినవు?" అని అడిగాడు తన ఊరివాడిని చూసిన ఆనందంతో.

"పనిమీద వచ్చినా, నాతో వస్తవా?" అన్నాడు ఆదినారాయణ.

"సరేపద."

ఆదినారాయణ కమ్యూనిస్టు పార్టీ వర్కరు. జిల్లా నాయకుడు ప్రభాకరరావు నగరంలోని పార్టీ నాయకులతో సంప్రదించటానికి హైదరాబాదు వచ్చాడు. ఆదినారాయణ ధర్మరాజును ఆయనకు పరిచయం చేశాడు.

"మన జిల్లావాడే. హైదరాబాదులో ఉంటున్నాడు."

"ఏం చేస్తున్నవయ్యా ఈడ, ఆడ జిల్లా అంతా అగ్గిమీదుంటే" అని అడిగాడు నాయకుడు ధర్మరాజుని.

"సంస్కృత పాఠశాలలో చదువు పూర్తి చేశాను. ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాను" జవాబిచ్చాడు ధర్మరాజు.

"ఇంగ్లీషు కూడా చెప్పారా మీ ఇస్కూల్లో."

"ఆ మ్లేచ్ఛ భాష మేం చదవం."

"తప్పుడు ఆలోచనల్లో ఉంటివి. ఏ భాషయినా భావ వినిమయానికి వినియోగించే వాహిక. ఇంగ్లీషు కూడా నేర్చుకో. సరే ఎంతవరకు చదివినావు."

"మద్రాసు విశ్వవిద్యాలయం వారి విద్వాన్ పరీక్ష పాసయ్యాను."

"మరీడ నౌకరికోసం గోళ్లు గిల్లుకుంటూ కూర్చుంటివా? మనకు స్వాతంత్ర్యం వద్దా? సంస్థానంలో బడుగు రైతులు, కార్మికులు, కూలోళ్లు ఎంత బాధకు గురవుతున్నారో నీకు పట్టదా? సమాజం నుండి మనం తీసుకోటమేగానీ తిరిగి ఇవ్వటంలేదా?"

"సమాజం నాకేమివ్వలేదు."

"ఇవ్వకేం చాలా ఇచ్చింది. నువ్వు మాట్లాడే భాష నీకిచ్చింది. నువ్వు చదువుకోటానికి కనీసం సంస్కృత పాఠశాలనయినా ఇచ్చింది. నువ్వు బతకటానికి తిండిపెట్టింది. ఏది తింటే నీ వంటికి మంచిదో ఏది విషమో నీకు నేర్పింది. అంతా సమాజం నుండి తీసుకున్న మనం సమాజానికి ఏమీ ఇవ్వకపోవటం కృతఘ్నత అన్పించుకుంటుంది."

ఆ మాటలు వింతగా అన్పించాయి ధర్మరాజుకు. అప్పటికేం మాట్లాడలేదు అతను. అయితే ఆ మాటలు రోజుల తరబడి అతన్ని నిద్రపోనియ్యలేదు. ఇంక అతనికి హైదరాబాదులో ఉండబుద్ధి పుట్టలేదు. ధర్మపురికెళ్ళాడు. అప్పుడు కమ్యూనిస్టు ఉద్యమం తీవ్రంగా ఉంది కరీంనగర్ జిల్లాలో. అధికారులు జనాల్నుండి అన్యాయంగా లెవీ ధాన్యాన్ని వసూలు చేస్తున్నారు. నాయకుల ప్రోత్సాహంతో, అండదండలతో గ్రామస్థులు అధికారులపై తిరగబడ్డారు. వారిపై దాడికి దిగారు. ఆదినారాయణతో కల్సి 1945-46లలో జగిత్యాలలో జరిగిన, కమ్యూనిస్టు ఆంధ్ర మహాసభ శాఖ సమావేశాలకు వెళ్ళాడు ధర్మరాజు. కమ్యూనిస్టు ఉద్యమం కరీంనగర్ జిల్లాలో కరీంనగర్, సిరిసిల్లా తాలూకాల్లో వ్యాప్తి పొందినంతగా మిగతా తాలుకాల్లో అంతగా వ్యాప్తి పొందలేదు. బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతిరెడ్డి, పోల్కంపల్లె వెంకటరామారావు. ఎ.ప్రభాకరరావు లాంటి నాయకులు ఆ తాలూకాలకు చెందిన వాళ్ళవటమే అందుకు కారణం.

నాయకుల ఆదేశం మేరకు అంతకు ముందు మిగతా తాలుకాల్లో ఉద్యమ వ్యాప్తికి పనిచేసినా 'నీవతన్ల పన్జేయాల' అని వాళ్ళన్నందువల్ల ధర్మపురికి తిరిగి వచ్చాడు. ఆ ఏడు జగిత్యాల తాలుకాలో తుఫాను కారణంగా పంటలు నాశనమయ్యాయి. తాలూకాలోని పోతారం, రామన్నపేట, అంతర్‌గాంవ్, తుంగూరు, ధర్మపురి, కోరుట్ల, మల్యాల గ్రామాలకు చెందిన రైతులు లెవీ ధాన్య సేకరణను ఆపివేయాల్సిందిగా మహజర్లు పెట్టుకున్నారు. లెవీ, గల్లా, మాల్‌గుజారి పన్నుల వసూళ్ళను మాఫీ చేయాలని ఆందోళన లేవనెత్తారు. ఈ ఆందోళనకు ఆ ప్రాంతంలో ఆదినారాయణ, ధర్మరాజు నాయకులుగా వ్యవహరించారు. ధర్మపురిలో కాంగ్రెస్ ఉద్యమం కూడా తీవ్రంగానే ఉంది. ఖాదీ సెంటర్లు, వయోజన విద్యా కేంద్రాలూ ఏర్పాటు చేశారు.

ధర్మపురి దేశ్‌ముఖ్ రామభూపాలరావుకు భయం పట్టుకుంది. ఉద్యమకారులు గ్రామస్థుల నుండి ఏ పని చేయించుకున్నా అందుకు ప్రతి ఫలమివ్వాలంటున్నారు. జనం కూడా తెలివిమీరిపోయారు. దొర వేంకటాచార్యులను పిల్చి చీవాట్లు వేశాడు "నువ్వా నీ కొడుకుతో కల్సి నాపై ధ్వజమెత్తావా?" అంటూ. వేంకటాచార్యులు కూడా ధర్మరాజు చర్యలను సహించలేకపోయాడు. అంతకుముందు అతనికీ ధర్మరాజుకూ మాటామాటా వచ్చినా తెగేదాకా ఎవరూ లాగలేదు. కాంగ్రెసు వాళ్ళు సత్యాగ్రహ ఉద్యమం చేపట్టారు. అందులో భాగంగా గాంధీ జయంతిని జరిపినప్పుడు ధర్మరాజు, ఆదినారాయణలు కూడా ఖాదీ సెంటరుకు వెళ్ళారు. అది వేంకటాచార్యులకు నచ్చలేదు.

"నువ్వు ఊర్లో ఉండిచేసే పన్లేం బాగలా. తిన్నది అరక్క ఏడుస్తున్నావు. అడుక్కుతినే నాయాళ్ళతోనేంది? దొర నిన్ను రమ్మన్నడు. జగిత్యాల ఇస్కూలులో నీకు నౌకరీ చేయిస్తననుండె. దొర తానికెళ్దాం రేపు" అన్నాడు.

"నీ దొర ఇప్పించే ఉద్యోగం నాకక్కర్లేదు. మనుషుల్ని పశువులుగా పరిగణించే ఆయనతో నాకేం సంబంధం లేదు. నువ్వు కూడా ఆయన దగ్గర పని చేయటం నా కిష్టం లేదు" అన్నాడు ధర్మరాజు.

"నోర్మూయ్యి, దొర చలవవల్లే మన నోటికింత కూడుపోతుంది. దొర నెదిరించి ఊర్ల బతకటమే!"

"నేనింక ఆ దుర్మార్గపు తిండి తినదల్చుకోలేదు."

"మీయమ్మ నీ సంగతి బాగానే పసిగట్టింది. అందుకే నిన్నెక్కడ ఉంచాలో అక్కడే ఉంచింది. జాలిపడి ఏడేళ్ళ వెధవని తీసుకొచ్చి విద్యాబుద్ధులు చెప్పిస్తే నువ్వు అలగా జనంతో చేరి నా తిండి ఎక్కసమైందంటావా? నా మాట కాదన్లేకే దొర ఇప్పటిదాకా పస్తా యిస్తుండు. లేకపోతే ఈపాటికి జైలు కూడు తింటుండేవాడివి."

"ఈ జమాన్ల అందరి మేలుకోరెటోళ్లంతా జైల్లో ఉండోల్సినోళ్లే. నాకందుకు దిగుల్లేదు."

"నా ఇంట్లో ఉండి నువ్వు దొరకి వ్యతిరేకంగా పన్జేయటానికి వీల్లేదు. ఉండదల్చు కుంటే బుద్ధిగుండు. లేకుంటే ఎళ్లిపో. ఇంట్లుండి పోకిరి పన్లు జేస్తివా కాళ్లిరగ్గొడతా."

"ఏంది పిల్లగాణ్ణి ఇంట్లనుండి ఎళ్లమంటున్నావు. ఏడకెళ్తాడు. బుద్ధిగా ఉంటాడులే. ఏమనక" అంది పినతల్లి అతనికి వత్తాసు వస్తూ.

"లేదు పిన్నమ్మా! నేనుండను. నేను చెయ్యాల్సిన పని చెయ్యకపోతేనా మనసుండ బట్టదు. నా వల్ల బాబయ్యకు దొర నుండి మాట వస్తది. నాపై ప్రేమలేక వెళ్లమనటంలేదు బాబయ్య. నేనింట్లో ఉంటే అందరి బతుకు దుర్భరమవుతుంది" అంటూ ఇంట్లో నుండి బయటకొచ్చేశాడు ధర్మరాజు.

"మనకు పిల్లల్లేరు. వాడే మన పిల్లగాడనుకుంటే వాడినీ తరిమేస్తివి. వాడిని పిలువు, పోతున్నాడు" అంది వేంకటాచార్యుల భార్య గుండెలు బాదుకుంటూ.

"మూయ్యవే నోరు. సాయంత్రానికి వాడే తిరిగి వస్తాడు. ఓ పూట తిండి లేకపోతే బుద్ధి తిరిగివస్తాది."

ఇంట్లో నుండి బయటికొచ్చిన ధర్మరాజు లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వెళ్లాడు. ఎక్కడికి వెళ్లాలో, ఏం చెయ్యాలో తోచలేదు. ఊళ్లో వయోజన విద్యా కేంద్రం నడుపుతున్న లక్ష్మయ్య తనకు మిత్రుడే కానీ బలిజ కులస్థుడు. ఖాదీ కేంద్రం నడిపే కమ్మరి కొమరయ్య తనకు స్నేహితుడే, తన పార్టీ వర్కరు ఆదినారాయణ కాపు కులస్థుడు. అయితే ఎవరింట్లో ఉండటానికీ, భోజనం చేయటానికీ అతనికి మనస్కరించలేదు. తను బ్రాహ్మణుడు, వాళ్ల ఇంట్లో భోజనం చెయ్యటమా అన్న ఇదమిత్థంకాని భావన అతని మన సును తొలిచేసింది. మధ్యాహ్నమైంది. కడుపు నకనకలాడుతోంది. ఆలోచన్లు కడుపును తినేస్తుంటే అతనలాగే మండపంలో కూర్చునుండిపోయాడు.

ఇంతలో ఓ విస్తరాకులో పులిహోర, దద్ధోజనం పట్టుకుని ఓ వ్యక్తి అతని దగ్గరకు వచ్చి "తిను" అన్నాడు. ఎదురుగా అన్న శ్రీధరస్వామి. తమ్ముడు తనవంక చూసినప్పుడు నవ్వాడు అతను.

ఈ పదకొండు పన్నెండేళ్లలో శ్రీధర స్వామి పరిస్థితి కొంతమెరుగైంది. వేంకటాచార్యులు దొరకి చెప్పి స్వామి ఆలయంలో అతన్ని పూజారిగా నియమింపచేశాడు. అయితే ఈ విషయం అలివేలుకు తెలీదు. తెలిస్తే ఆమె అది పడనిచ్చేదికాదు.

ఓ క్షణం అన్న వంక చూసి పులిహోర తినసాగాడు. శ్రీధరస్వామి ఓ గ్లాసులో మంచి నీళ్లు తీసుకు వచ్చాడు.

ధర్మరాజు పులిహోర, దద్ధోజనం తిని మంచినీళ్లు తాగిందాకా ఉండి, "కోవెల అందరిదీ, బతికించేవాడు ఆ శ్రియఃపతి" అని చెప్పి వెళ్లిపోయాడు.

ధర్మరాజు ఒక్కమాట కూడా మాట్లాడకుండా వెళ్లిపోతున్న అన్నవంక విషాదంగా చూశాడు. కడుపు నిండాక అతను అదినారాయణను కలుసుకోవటానికి వెళ్లాడు. కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీలు సంయుక్త కార్యాచరణ సమితిని ఏర్పాటుచేసి విలీనోద్యమం (జాయిన్ ఇండియన్ యూనియన్ మూవ్‌మెంటు) మొదలెట్టాయి. అందులో భాగంగా ఆగస్టు 7, 1947న వలంటీర్లు సత్యాగ్రహం చేయాలి. ఆగస్టు 15న స్వాతంత్ర్యదినం, ఆగస్టు 17న స్వతంత్ర భారతదినం. సెప్టెంబరు 2న జాతీయ జెండాదినం, సెప్టెంబరు 8న పోలీసు దమన వ్యతిరేకదినం పాటించాలని సంయుక్త కార్యాచరణ సమితి పిలుపునిచ్చింది. ధర్మరాజుకు కమ్యూనిస్టు, కాంగ్రెసు పార్టీల మధ్య భేదంలేదు. అప్పటికింకా అతనికి పూర్తిగా కమ్యూనిస్టు సిద్ధాంతాలు వంటబట్టలేదు. అందుకే కాంగ్రెసు వాళ్లతో కూడా కలిసిమెలిసి ఉండేవాడతను. మిత్రులతో మాట్లాడి, రాత్రి పాఠశాలలో వయోజనులకు పాఠాలు చెప్పి వచ్చి గుడిలోనే పడుకున్నాడు. మళ్లీ మర్నాడు, ఆ తర్వాత మూడు రోజులు అన్న శ్రీధరస్వామి మొదటి రోజులాగానే విస్తరిలో పులిహోర, దద్ధోజనం తెచ్చి తమ్ముణ్ణి ఆదుకున్నాడు. మొదటిరోజు అన్న చెప్పిన రెండు మాటలు తప్ప మళ్లీ ఇద్దరి మధ్యా మాటలే జరగలేదు. ఆ తరువాత అన్నకు తమ్ముణ్ణి ఆదుకోవాల్సిన భారం తప్పిపోయింది.

సంయుక్త కార్యాచరణ సమితి మొదలెట్టిన విలీనోద్యమం నిజాం ప్రభువు, జమీందార్లు, జాగీర్దార్లు, పెత్తందార్ల గుండెల్లో గుబులు పుట్టించింది. నైజాం రాష్ట్రం భారతదేశంలో విలీనమయితే తామనుభవించే అధికారాలు, సుఖాలు పోతాయని భయం కలిగింది వాళ్లకి. ధర్మపురి దొర రామభూపాలరావు శత్రువుల పీడవదిలించుకోటానికి పథకం వేశాడు.

ఆగస్టు 15, 1947న ధర్మపురిలో స్వాతంత్ర్య దినోత్సవం ఉత్సాహంగా జరిగింది. త్రివర్ణ పతాకాన్ని ఖాదీ సెంటరుపైన ఎగురవేశారు. పాటలు పాడారు. సభ జరిపారు. కార్యకర్తలంతా పార్టీ విభేదాల్లేకుండా ఉత్సాహంగా కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. అంతలో పొద్దున పదకొండు గంటలకల్లా జగిత్యాల అమీన్ గులాం రసూల్ పదిమంది జవానులనేసుకుని వచ్చాడు. ఇద్దరు జవాన్లు తుపాకులు ఎక్కుపెట్టి నుంచుంటే మిగతా వాళ్లు లాఠీలతో సభ జరుపుకుంటున్న జనంపై విరుచుకుపడ్డారు. చావచితకకొట్టటం మొదలెట్టారు. ఓ దశలో జనం తిరగబడే ప్రయత్నం చేశారు. కానీ పోలీసులు తుపాకులు

గాల్లో పేల్చటంతో జనం ప్రాణ భయంతో చెల్లాచెదురయ్యారు. అమీన్ ధర్మరాజు, ఆది నారాయణ, లక్ష్మయ్య, కొమరయ్యలను నిర్బంధించి చేతులకు బేడీలు వేసి "మీలో ఎవడు కాంగ్రెసు, కమ్యూనిస్టోళ్లను అనుసరించినా ఇదే శిక్ష" అంటూ నలుగుర్నీ లాఠీలతో బాదుతూ వీధుల్లో నడిపిస్తూ బస్సుస్టాండుకు తీసుకు వెళ్లాడు.

గుమ్మంముందు నిలబడి, అమీన్ పోలీసుల లాఠీ దెబ్బలు తింటూ వెళ్తున్న నలుగురు యువకుల్ని చూసి "ఎవరువాళ్లు? ఎందుకు వాళ్లనట్లా కొట్టుకుంటూ తీసుకు వెళ్తున్నారు?" అనడిగింది అలివేలు కొడుకు శ్రీధరస్వామిని.

"అదిగో ఆ పొట్టి మనిషి కొమరయ్య. ఖాదీ సెంటరు నడుపుతాడు. ఆ లావాటాయన వయోజన విద్యాకేంద్రం నడిపే లక్ష్మయ్య. ఆ నల్లటి పిల్లగాడు ఆదినారాయణ. ఆ నాలుగో వాడు నష్టజాతకుడు, ధర్మరాజశర్మ. వీళ్ళిద్దరూ కమ్యూనిస్టోళ్లు" అని వివరించాడు శ్రీధర స్వామి.

"నష్టజాతకుడెవరు?" అంది అలివేలు అర్థంకాక.

"తమ్ముడు."

"వాడిపేరు ధర్మరాజశర్మా?"

"అవును... బాబయ్య పెట్టాడు."

ఏడేళ్ల తర్వాత మళ్లీ అప్పుడు చూశాడు ధర్మరాజు తల్లిని. శ్రీధరస్వామి పక్కనుండటం వల్ల ఆమెను పోల్చుకోగలిగాడతను. సంవత్సరంలో పది, పదకొండు నెలలు హైదరాబాదు లోనే గడిపేవాడు అతను. ఎప్పుడో ఓ నెల రోజులకు ధర్మపురి వచ్చినా తమ ఇల్లున్న వీధి ఛాయలకే వెళ్లేవాడు కాదతను. మొదట్లో తల్లిపట్ల ఉన్న ద్వేషం అతన్నావైపుకు వెళ్లనివ్వ లేదు. ఆ తరువాత క్రమక్రమంగా తల్లి పరిస్థితులు అర్థం చేసుకుని ఆమెని క్షమించగలిగినా ఓ రకమైన ఉదాసీనతతో అతనావైపు వెళ్లలేదు. ఊరికి వచ్చినప్పుడు కోవెలలో అన్న శ్రీధరస్వామి కన్పించినా అన్నాతమ్ములెప్పుడూ పలుకరించుకోలేదు.

గుమ్మంలో తల్లిని చూసి ఓ క్షణమాగాడు ధర్మరాజు. అమీన్ "చెల్ బే చెల్" అంటూ బూటుకాలితో ఒక్క తన్నుతన్నాడు అతణ్ణి. ధర్మరాజు కిందపడిపోయాడు. జవాన్లు లాఠీలతో అతన్ని సత్కరిస్తూ, అతనిని లేపి తోసుకుంటూ తీసుకెళ్లారు. తన్నుకు అమాంతం కిందపడటంవల్ల కుడిచెంప, మోచేయి దోక్కుపోయాయి. రక్తం కారసాగింది.

"అయ్యో..." అంది జీరబోయిన కంఠంతో అలివేలు.

"నువ్వు విచారించకు. నష్టజాతకుడికి అంతకంటే అధిక సత్కారమేం జరుగదు!" అన్నాడు శ్రీధరస్వామి.

ఆమె మారుమాట్లాడకుండా నోట్లో చెంగు నొక్కుకుని ఏడుపు బయటికి రాకుండా ఇంట్లోకి వెళ్లిపోయింది.

జగిత్యాల కోర్టులో కేసు విచారణ జరిగింది. కొమరయ్య, లక్ష్మయ్యలపై భారతదేశపు జండాలు ఎగరేసి స్వాతంత్ర్య దినం జరుపుకున్నారనీ, గాంధీ ఫోటో పెట్టారనీ ఆరోపణలు

చేశారు పోలీసులు. ధర్మరాజు, ఆదినారాయణలపై రాజద్రోహం, ఊరిదొరపై హత్యా ప్రయత్నం కేసులు పెట్టారు. దొర రామభూపాలరావును చంపాలనే ప్రయత్నంలో ధర్మ రాజు, ఆదినారాయణలు దొర ఇంటిపై బాంబులు వేశారు. అదృష్టవశాత్తూ గడీ ప్రహరీ గోడ కూలిందికాని ఇంటికేం ప్రమాదం జరగలేదు. దొర ప్రాణాలు రక్షింపబడ్డాయి. అది విన్న ధర్మరాజు, ఆదినారాయణలు ఆశ్చర్యపోయారు. కేసు తేలటానికి అర్నెల్లు పట్టింది. కొమరయ్య, లక్ష్మయ్యలకు ఆర్నెల్ల జైలు శిక్ష, ధర్మరాజు, ఆదినారాయణలకు మూడేళ్ల కఠిన కారాగారశిక్ష విధించింది కోర్టు. వేంకటాచార్యులు కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాడు. ధర్మరాజు తన అన్న కొడుకనీ, తాను పెంచి పెద్ద చేశాననీ, అయినా వాడు ఆకతాయిల్లో చేరి రాజద్రోహ నేరాలు చేశాడనీ, దొరని అంతమొందించే ప్రయత్నంలో అతనూ, ఆదినారాయణ కల్సి దొర గడీపై బాంబులు వేయటం తాను చూశాననీ కోర్టులో చెప్పాడు. ఆయన సాక్ష్యమే వాళ్లిద్దర్నీ తిరుగులేకుండా మూడేళ్లు జైల్లోకి నెట్టింది.

సెప్టెంబరు 13, 1948 నాడు హైదరాబాదుపై పోలీసు చర్య చేపట్టింది భారత ప్రభుత్వం. నిజాం రాష్ట్రం భారతదేశంలో విలీనమయింది. రాజకీయ ఖైదీలందరూ విడుదలయ్యారు. ధర్మరాజు, ఆదినారాయణ కూడా విడుదలయ్యారు. కానీ చంచల్‌గూడా జైలు గేటు బయటికి రాగానే మళ్లీ వాళ్లని పోలీసులు అరెస్టు చేశారు. కలకత్తాలో 1948లో జరిగిన కమ్యూనిస్టు సమావేశంలో సాయుధపోరాటం కొనసాగించాలనే రణదీవే ఆలోచనను పార్టీ అంగీకరించింది. స్వతంత్ర భారత ప్రభుత్వం శాంతి భద్రతల రక్షణ పేరుతో కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది. నాయకులను నిర్బంధించింది. అజ్ఞాతంలోకి వెళ్లినవారు అడవులలోకి పోయి ఉద్యమం కొనసాగించారు. దాదాపు ఒకటిన్నర సంవత్స రాలు సాయుధ పోరాటోద్యమం నడిచింది. అలా కమ్యూనిస్టులను నిర్బంధించే క్రమంలో ధర్మరాజు, ఆదినారాయణలు తిరిగి అరెస్టయ్యారు. 1950 నాటికి కమ్యూనిస్టులలో అంతర్మథనం మొదలైంది.

సాయుధ పోరాటానికన్నా రాజ్యాంగ పద్ధతులతో అధికారం సాధించి తమ సిద్ధాం తాలు అమలుచేయడం ఉచితమన్న భావన ఏర్పడింది. రాజ్యాంగ పద్ధతులకు లోబడి నడుచుకోగలమని కమ్యూనిస్టు పార్టీ ప్రకటించినప్పుడు ప్రభుత్వం పార్టీపై నిషేధాన్ని తొలగించింది. రాజకీయ ఖైదీలందరూ విడుదలయ్యారు. ధర్మరాజు, ఆదినారాయణ కూడా విడుదలయ్యారు. అయితే జైలు జీవితం ధర్మరాజుకు చాలా పాఠాలు నేర్పింది. ప్రపం చంలో సమానత్వం నెరపే సంస్థలు రెండు. కారాగృహం, శ్మశానం. డబ్బు, పలుకుబడి లేకపోతే కారాగృహంలో కూడా శ్మశానంలోలాగా సర్వసమానత్వం లభిస్తుంది. ధర్మ రాజులో ఏమూలో ఉన్న అగ్రవర్ణ ఆధిక్య భావన తొలగిపోయింది. ఆహార వ్యవహారాల్లోని ఇదివరకటి పట్టు సడలిపోయింది.

ధర్మరాజుపై చేయని నిందను మోపిన దొర రామభూపాలరావు ఎనిమిది నెలల తర్వాత ప్రజల ఆగ్రహానికి గురై ధర్మపురిలో ఉండలేక కరీంనగర్ పారిపోయాడు. మళ్ళీ పోలీస్ యాక్షన్ తర్వాత కమ్యూనిస్టులు జైళ్లకో, అడవులకో ప్రస్థానం చేశాక ధర్మపురి

తిరిగివచ్చాడు. ఈ లోపల ఆయన బంటు వేంకటాచార్యులు చాలా తిప్పలు పడ్డాడు, వేధింపులకు గురయ్యాడు. తిరిగి వచ్చిన రామభూపాలరావు కాంగ్రెసు పార్టీ నాయకుడయ్యాడు. మళ్ళీ యజమాని, బంటుల పలుకుబడి కొనసాగింది. పులి మేకతోలు కప్పుకుంది. పూర్వపు అధికార దర్పం, అరాచకత్వం బయటికి కన్పించేది కాదు. జైలునుండి విడుదలయ్యాక ఆదినారాయణ ధర్మపురి తిరిగి వెళ్ళాడు కానీ, ధర్మరాజు హైదరాబాదులోనే ఉండిపోయాడు. అక్కడున్న వాళ్ళకు తను అక్కర్లేదు. హైదరాబాద్‌లో ఓ స్కూల్లో తెలుగు పండితుడిగా అతనికి ఉద్యోగం దొరికింది. ఉద్యోగం దొరికాక, తన మొదటి జీతంలో పావు భాగం తల్లికి మనియార్డరు చేశాడు ధర్మరాజు. అప్పుడతని జీతం రూ. 84 ఉండేది. ఇరవై ఒక్క రూపాయలు పంపాడు. తల్లి మనియార్డరు తీసుకున్నాక అన్న శ్రీధరస్వామి అతనికి ఉత్తరం రాశాడు. మాటల మనిషి కాదతను. ఆత్మీయంగా, గుండెను తాకేట్టు ఉంది ఆ ఉత్తరం.

"నువ్వు పంపిన మనియార్డరు అందినది. అమ్మ డబ్బు తీసుకొనునో లేదోయని సందేహించితిని. 'నష్టజాతకుడు పంపిన డబ్బు నువ్వు తీసుకొందువా?'యని అడిగితిని. 'తీసుకొందును. తిరస్కరించి వాని పాప భారము పెంచను' అని చెప్పినది. గృహ ఆర్థిక పరిస్థితిని గమనించి, నాకు సాయము కూడా యగునేమోనని భావించి, ఆమె ఆ ద్రవ్యమును స్వీకరించి ఉండవచ్చు. మన పక్క ఊరి వాస్తవ్యులు శ్రీమాన్ వెంగళాచార్యుల వారి పుత్రికతో నా వివాహము నిశ్చయమైనది. వచ్చే మాసంలో పెండ్లి జరుగును. నిన్నేమని ఆహ్వానించవలెనో నాకు తెలియుటలేదు. కారాగారవాస శిక్షయనుభవించిన వారు ప్రాయశ్చిత్తము చేసుకొనవలె. నువ్వు అందుకు అంగీకరించవని నాకు తెలియును. ఆమెకు ఆ పట్టు ఉండును. నువ్వు వచ్చినను అమ్మ నీతో మాటలాడునన్న ఆశ నాకు ఇసుమంతయును లేదు. ఆ శ్రియఃపతి నీకు సదా ఆయురారోగ్యముల నిచ్చి నిన్ను కాపాడుగాక!"

భాష గ్రాంథికమైనా హృదయం అగ్రథితం. ఉత్తరాన్ని అందుకున్న ధర్మరాజుకు సంతోషమేసింది. అతను అన్నగారి పెళ్ళికి వెళ్ళలేదు. కానీ, ప్రతినెలా తన జీతంలో పావుభాగం తల్లికి పంపుతూనే ఉన్నాడు. జీతంతోపాటు ఆ మొత్తం కూడా పెరిగింది. రిటైరయ్యాక పెన్షన్‌గా వచ్చే ఆదాయం తరిగాక ఆమెకు పంపే మొత్తం కూడా తరిగింది. తను పంపిన డబ్బును స్వీకరించడమేకానీ, "మాకు అవసరం ఉంది, ఇంకా ఎక్కువ పంపు" అని అన్నగాని, తల్లిగాని అతనికి ఉత్తరం రాయలేదు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఓసారి ఎం.ఎల్.ఏ. రాంభూపాలరావు గారి కోర్టు వ్యవహారం విషయమై హైదరాబాదు వచ్చిన పినతండ్రి వేంకటాచార్యులు ధర్మరాజును కలిశాడు. ఆయనలో పెంచిన మమకారం పోలేదు.

"దొరను కాదని బతకలేని స్థితిలో అదాలత్‌లో తప్పుడు సాక్ష్యమిచ్చిన. దొంగ సాక్ష్యం ఇచ్చినానని తెల్సి మీ అమ్మ వచ్చి నన్ను దుమ్మెత్తిపోసినాది. 'పిల్లగాడు నీకేం చెరుపు చేసిండు. అబద్ధం సాక్ష్యం చెప్తవా? ఆ అన్నకు నువ్వు తమ్ముడిగ ఎట్ల పుట్టినవో నాకు తెలియడం లేదు' అంటూ నోటికొచ్చినట్టు తిట్టింది....

కథా నిలయం
4.6.25

" 'నే మంచిపనే జేస్తిని. పిల్లవాడు ఈడ్నేవుంటే దొర చంపించినా దిక్కులేదు. అందుకు కోషిశ్ కూడా జేసిండు. బంధిఖానాలో అయినా పిల్లగాడు బతికున్నడు. అందుకు సంతోషించు. నేనేం జేయను మరి! సాకి పెంచిన పిల్లగాడిని జెయిలుకు పంపినందుకు నేను కుమిలిపోలేదా? మీ చెల్లెమ్మయితే మంచమే పట్టె. మనమందరం పిల్లగాడిని చంపినాం. నన్నే అంటవేంది? 'నీ చేతను, నా చేతను, వరమడిగిన కుంతిచేత...' అన్నట్టు పిల్లగాడిని దోఖా చెయ్యందెవరు? 'తిలాపాపం తలా పిడికెడు' అని చెప్పిన మీయమ్మకు. నోర్మూసుకుని వెళ్ళిపోయింది వదినమ్మ. నువ్వు ధర్మపురికి రారా. మీ పిన్నమ్మ దిగులెట్టుకుంది నీ గురించి" అన్నాడు వేంకటాచార్యులు.

అయన పరిస్థితి ధర్మరాజుకు తెల్సు. అందుకే ఆయన పట్ల అతనికేం కినుక లేదు. తన్ను తల్లిలాగా చూసిన పినతల్లికి తనేం చేయలేకపోయాడే అన్న బాధ అతనికుంది. "నువ్వూ, చిన్నమ్మా వచ్చి నా దగ్గరుండొచ్చుగా. అక్కడ మీకు మాత్రం ఏముంది?" అన్నాడు ధర్మరాజు.

ఆయన నవ్వాడు. "అట్ల కుదరదులే నాయన! మా జీవితం అక్కడ్నే వెళ్ళమారి పోవాల" అన్నాడు.

పినతండ్రి వెళ్ళేటప్పుడు పినతల్లికి మంచి ఖరీదైన చీరకొని పంపాడు ధర్మరాజు.

ఆదినారాయణ పినతండ్రి రంగారావు హైదరాబాదులో వకీలు పనిచేస్తూ ఉండే వాడు. ఆదినారాయణ, ధర్మరాజు జైలులో ఉన్నకాలంలో ఆయన తన కూతురు నిర్మలను వెంట పెట్టుకుని తన అన్నకొడుకుని చూడటానికి జైలుకొచ్చేవాడు. అలా నిర్మలతో పరిచయమైంది ధర్మరాజుకు. అప్పుడు ఆమె బి.ఎ. చదువుతూ ఉండేది. జైలు నుండి విడుదలయ్యాక కూడా తరుచూ రంగారావు గారింటికి వెళ్తూండేవాడు ధర్మరాజు. నిర్మలతో పరిచయం ప్రేమకు దారితియ్యగా రంగారావుగారి ఆశీర్వాదంతో వారి వివాహమైంది. ధర్మపురి నుండి పెళ్ళికి ఆదినారాయణ వచ్చాడు. నిర్మల చదువు పూర్తిచేసి రెవెన్యూ డిపార్ట్‌మెంటులో క్లర్కుగా పనిచేస్తోంది.

ఓ రోజు లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి వచ్చి, పూజారి శ్రీధరస్వామి శఠగోపం పెట్టి, ఇచ్చిన తీర్థప్రసాదాలు పుచ్చుకుంటూ ఆదినారాయణ తల్లి అతనితో అంది. "మా మరిది బిడ్డను పెండ్లి చేసుకున్నడంట నీ తమ్ముడు. కాలమయిమ! పెద్దోళ్ళకు కూడా చిన్నబుద్ధులు పుడ్తుండె!" అని.

"అట్లనా! మాకు తెల్వదు" అన్నాడు శ్రీధరస్వామి.

అతనికి తెలియంది పెళ్ళి సంగతో, చిన్న బుద్ధుల సంగతో ఆమెకర్థం కాలేదు. ఏదో తనలో తనే గొణుగుకుంటూ వెళ్ళిపోయింది ఆ ముసలావిడ.

పెళ్ళి సంగతి తెలిసిన తర్వాత శ్రీధరస్వామి ధర్మరాజుకు ఉత్తరం రాశాడు.

"నువ్వు కులాంతర వివాహం చేసుకున్నట్లు తెలిసినది. మంచిదే... నీ జ్ఞానము ననుసరించి, నీవు నమ్మిన దానిని ఆచరించితివి. నీకు సుఖమగుగాక. అమ్మకు నీ వివాహ విషయం చెప్పితిని. 'ఆ భ్రష్టుడంతకంటే గొప్పపని చేయునని నేను ఆశించలేదు' అని

ఆమె సమాధానం చెప్పినది. ఆమె మాట కఠినమని నీవు ఎరుగుదువు. ఆమెపట్ల నీవు కోపము పెంచుకొనవలదు. పీడితులు, దుఃఖితులు, అన్నార్తుల కోసము నువ్వు కష్టముల పాలయితివని ఆమె ఎరుంగును. 'వాని జన్మజన్మముల పాపములు క్షాళితమైనవి. వానిని నేను క్షమించితిని' అని నిన్ను నిర్బంధించి జైలుకు తీసుకు వెళ్ళిన వెనుక ఆమె నాకు చెప్పినది. ఆమె మనసు ఆత్మగ్లానిపూరితమై యుండినదని నా భావము. అందువలననే ఆమె ఎప్పుడునూ నీ ప్రస్తావన చేయదు."

రోజులు గడిచాయి. 1962లో కమ్యూనిష్టు పార్టీ రెండుగా చీలిన తర్వాత ధర్మరాజు పార్టీతో అంతగా సంబంధాలు పెట్టుకోలేదు. ఆ తర్వాత పార్టీ మరిన్ని చీలికలైంది. పార్టీ సిద్ధాంతాలు పలచబారి, మిగతా పార్టీలకూ ఆ పార్టీకి భేదమున్నట్లు అతనికి కన్పించలేదు. అతని జీవితంలోనూ ఎన్నో మార్పులు వచ్చాయి. అతనికి ముగ్గురు పిల్లలు కలిగారు. యూనివర్సిటీలో ఎం.ఏ. చేసి ఆపైన డాక్టరేటు పట్టం కూడా పొందాడు. ఉద్యోగంలో ప్రమోషను కూడా లభించింది. కాలేజీలో లెక్చరరయ్యాడు.

పినతల్లి మరణించిన వార్త అతనికందింది. శ్రీధరస్వామి ఉత్తరం రాశాడు.

"మొన్న వైకుంఠ ఏకాదశిరోజు ఉదయం ప్రాతః ఘడియలలో చిన్నమ్మ చనిపోయినది. బతికుండగా నిన్ను చూడవలెనని తపించినది. నీవు రావైతివి. నీకీ వార్త తెలిసి నువ్వు వచ్చువరకు ఆలస్యమగునని, ఆ పరమ పవిత్ర దినముననే ఆమె అంత్యక్రియలు నిర్వహించిన యడల ఆమె వైకుంఠ ప్రాప్తి పొందగలదని పెద్దలు చెప్పుట వలన ఆమెకు ఆ రోజునే దహన సంస్కారములు చేయటమైనది. నీవు వచ్చినను, వర్ణాంతర వివాహ కారణమున, కర్మకాండలో పాలు పంచుకొనుటకు అనర్హుడవు, పంక్తి బాహ్యుడవు కనుక, రాలేకపోయితినని మనస్సునందు బాధపెట్టుకొనవద్దు. బాబయ్య జీవితంలో ఇంత విషాదము సంభవించినను, ఆయన ముఖము చూచుటకు అమ్మ ఇష్టపడలేదు. ఆయన తన కొంపనార్పినవాడని ఆమె అభిప్రాయము. ఆయన వంటరివాడయినాడు, వంటా వార్పూ చేయు వారెవరునూ లేరు. మన ఇంటికి తీసుకు వద్దమని భావించితిని. ఈ పరిస్థితిలో అది అనుకూలించదని విరమించితిని."

అయితే, అలాంటి పరిస్థితి కలగకుండానే వెంకటాచార్యులు ఎక్కువకాలం బతకలేదు. భార్య పోయిన ఏడాదిలోపే ఆయనా చనిపోయాడు.

ఓసారి నిర్మల అంది "పిల్లలు మన సొంత ఊరు చూద్దామని ఉబలాటపడుతున్నారు. అన్నయ్య కూడా ఎన్నోసార్లు తన ఇంటికి రమ్మని ఆహ్వానించాడు మనల్ని. ఓసారి వెళ్ళివద్దాం ఏమంటావు?" అని.

"నేనా ఊరు రాను. వెళ్తే ఆదినారాయణ ఇంటికే వెళ్ళాలి. అమ్మ మనల్ని తన ఇంటికి రానీదు. నా ముఖం కూడా చూడటం ఆమెకిష్టమో కాదో నాకు తెలీదు. అంత దూరం వెళ్ళి ఆమెను చూడకుండా రావటం నాకు మనస్కరించదు" అన్నాడు ధర్మరాజు.

"పోనీ, నేనూ, పిల్లలూ వెళ్ళొస్తాం" అంది నిర్మల.

"సరే" అన్నాడు ధర్మరాజు.

నిర్మలా, పిల్లలూ ఆదినారాయణ ఇంటికి వెళ్ళారు. అతను సాయంత్రం వాళ్ళను కోవెలకు తీసుకెళ్ళాడు. చెల్లెలినీ, పిల్లలనూ శ్రీధరస్వామికి పరిచయం చేశాడు. నిర్మల బావగారికి నమస్కారం చేసింది. శ్రీధరస్వామి దూరంగా నిలబడే పిల్లల్ని, ఆమెని వాత్స ల్యంగా చూస్తూ ఆశీర్వదించాడు. "అమ్మ రోజూ కోవెలకు వస్తుంది. ఆమె వచ్చే సమయ మైంది. మిమ్మల్ని ఆమెకు పరిచయం చేస్తాను. మంటపంలో కూర్చోండి" అన్నాడతను.

ఓ పదినిమిషాలు గడిచాక మెల్లగా నడుచుకుంటూ మనసులో జపించుకుంటూ వచ్చింది అలివేలు.

"అదుగో, ఆమె మీ అత్తమ్మ" అని ఆదినారాయణ నిర్మలకు చూపాడు.

తెల్లటి మనిషి ఆమె. జుట్టు నెరసిపోయింది. సన్నగా ఉంది. కఠిన నియమాలు, ఉపవాసాలతో కృశించిపోయిన శరీరం. నుదుటిన సన్నటి తిరునామాలు. ఆ ముఖంలో కాఠిన్యం ఎక్కడ దాగివుందో పరిశీలనగా చూసింది నిర్మల.

అలివేలు స్వామికి ఎదురుగా నిలబడి సాష్టాంగప్రణామం చేసింది. "రంగ, రంగ" అనుకుంటూ లేచి నిలబడి, కొడుకు ఇచ్చిన తీర్థప్రసాదాలు స్వీకరించింది. కోవెలకొచ్చాక ఓ గంటసేపు ఆలయ మంటపంలో కూర్చుని జపం చేసుకోవటం ఆమె అలవాటు. తీర్థప్రసాదాలు స్వీకరించాక అలవాటు చొప్పున మంటపంవైపు వెళ్ళబోతుంటే శ్రీధరస్వామి చెప్పాడు తల్లికి. "ధర్మరాజు భార్యా, పిల్లలూ వచ్చారు. నువ్వు వాళ్ళను చూస్తావా?" అంటూ.

"ఎవరూ?" అంది ఆమె. ధర్మరాజన్న పేరు ఆమెకెప్పుడూ గుర్తుండదు. అది ఆమె పెట్టిన పేరుకాదు.

"నష్టజాతకుడి భార్యాపిల్లలూ వాళ్ళ పెత్తండ్రి ఇంటికొచ్చారు. అదుగో మంటపంలో ఆదినారాయణ పక్కనే కూర్చుందే ఆ పిల్లే నీ చిన్నకోడలు. పేరు నిర్మలట. ఆ పచ్చగవును వేసుకుందే ఆ పిల్లే నీ పెద్ద మనుమరాలు ఉష. ఆ స్తంభంపై పాకుతున్న పిల్లగాడు తమ్ముడి రెండో సంతానం. ధనుంజయ్ అని నాన్న పేరే పెట్టాడట. పిల్లిమొగ్గలు వేస్తున్న పిల్లగాడే నీ రెండో మనవడు ప్రద్యుమ్నుడు" అంటూ చూపించి చెప్పాడు శ్రీధరస్వామి.

"అలాగా" అంటూ యధాలాపంగా తన్ను మర్చిపోయి మంటపం వైపుగా చూసింది.

ఆలయం లోపలికి పడుతున్న సాయంకాలపు నీరెండ ఆమె ముఖంమీద పడు తున్నది. పశ్చిమంలో వెలుగుతున్న సూరీడు కళ్ళల్లో పొడిచాడో ఏమోకానీ ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ముఖం కిందికి దించుకుని కొంగుతో కళ్ళనీళ్ళు తుడుచుకుంది అలివేలు.

తెప్పరిల్లుకుంటూ కోపంగా అంది. "వాళ్ళెవరైతే నాకేం? వాళ్ళ సంగతి నాకు చెప్పకు" అంటూ మంటపంలోకి వెళ్ళేది కాస్తా ఆలయ ముఖద్వారంవైపు నడవసాగింది.

"పిల్లలు నాయనమ్మను చూస్తరంట. వాళ్ళను ఇంటికి తీసకవస్త" అన్నాడు శ్రీధర స్వామి పెద్దగా, దూరంగా పోతున్న తల్లితో.

"నేనెవర్నీ చూడను. నా ఇంటికెవరూ రానవసరంలేదు" అంది అలివేలు వెనక్కి తిరిగి చూడకుండా ఇంటికెళ్ళిపోతూ.

నిర్విణ్ణుడై నిలబడిపోయాడు శ్రీధరస్వామి. మంటపంలో నిలబడి అంతా వింటున్న నిర్మల అతనికి దగ్గరగా వచ్చింది. "పోన్లెండి. ఎవరికెంత ప్రాప్తమో, అంతే" అంది.

ఆ తరువాత మరెప్పుడూ ధర్మరాజు కానీ, అతని భార్యాపిల్లలు కానీ ధర్మపురి వెళ్ళింది లేదు. శ్రీధరస్వామినుండి కూడా ఉత్తరాలేం రాలేదు.

★ ★ ★

బస్సు ధర్మపురి చేరుకుంది. ధర్మరాజు, నిర్మల బస్సుదిగి శ్రీధరస్వామి ఇంటికి వెళ్ళారు. అదో చిన్న పెంకుటిల్లు. దీనంగా, దారిద్ర్యాన్ని వెలారుస్తూ ఉంది. ముందు వసారాలో తల్లి శవాన్ని పడుకోబెట్టారు. వీళ్ళని చూచి శవం పక్కన కూర్చున్న ఎనభై ఏళ్ళ వృద్ధుడు లేచి నిలబడ్డాడు. జీవితం నెరపిన కష్టాల గాఢపు రేఖలన్నీ ఆ ముఖంలో ఉన్నాయి. చెయ్యెత్తి పెట్టుకు చూసి, ఆ వచ్చినవాళ్ళు తమ్ముడూ, మరదలూ అని గుర్తించాడు శ్రీధరస్వామి.

"వచ్చినావా?" అని నవ్వుతూ వాత్సల్యంగా పలకరించాడు. పక్కన గుమ్మానికి చేరగిలబడి కూర్చున్న స్త్రీని చూపిస్తూ, "మీ వదిన" అన్నాడు.

"పిల్లలు... పిల్లలెవరూ లేరా?" అనడిగాడు ధర్మరాజు.

"ఎవరుంటారు? పదేళ్ళక్రితం పదహారేళ్ళ కొడుకుండె. గోదావరిలో స్నానం చేస్తూ, మరి ఏమయిందో నదిలో మునిగి చనిపోయిండు" అని చెప్పాడు శ్రీధరస్వామి.

భర్త కొడుకు ప్రస్తావన చెయ్యటంతో శ్రీధరస్వామి భార్య కొంగుతో కళ్ళద్దుకుంది.

"అయ్యో, నాకు తెలియనేలేదు" అన్నాడు ధర్మరాజు, బాధపడ్తూ.

"తెలిసినా ఎవరు మాత్రం చేయగలిగింది ఏముంది! ఆ శ్రియఃపతి నిర్దేశించినట్లే జరుగుతుంది అంతా."

ధర్మరాజుకేం మాట్లాడాలో తోచలేదు. అన్నతో తనంతకు ముందెప్పుడూ మాట్లాడిన గుర్తు అతనికి లేదు. పోయిన తల్లి వంక చూస్తూ ఆమె శవం పక్కన కూలబడ్డాడు. నిర్మలతో "కూర్చో... తల్లీ" అన్నాడు శ్రీధరస్వామి. ఆమె వసారా చివరన కూర్చుంది. చివరి క్షణాల్లో తల్లి ఎలా బాధపడి మరణించిందో వివరించసాగాడు శ్రీధరస్వామి తమ్ముడి పక్కన కూర్చుంటూ.

"దహనానికి అన్ని ఏర్పాట్లూ అయ్యాయి. నువ్వు వస్తవనే ఎదురు చూస్తుంటి. మరి లేద్దామా, నీకేమీ అభ్యంతరం లేకుంటే" అన్నాడు శ్రీధరస్వామి.

ధర్మరాజు సందేహిస్తూ అన్నవంక చూశాడు.

"నువ్వెవరివైనా ఆమె కొడుకువే కదా! పోయేముందు చెప్పింది. నువ్వు నమ్ముకున్న ఆదర్శం కాదనకపోతే, తనకు కడసారి వీడ్కోలు చెప్పమన్నది. నువ్వు వచ్చినాకే అంత్య క్రియలు మొదలెట్టమని చెప్పింది. తన్ను మన్నించమని నీకు చెప్పమన్నది. ఇతరులను అర్థం చేసుకున్న మనిషి తల్లిని అర్థం చేసుకోగలడు అంది. మరి లేచి ప్రారంభిద్దామా?"

"నీకు... నీకు అభ్యంతరం లేదా?"

"ఉండేది. కొడుకు బతికివున్న రోజుల్లో అన్ని అభ్యంతరాలూ ఉండేవి. వాడిని తీసుకు వెళ్తూ నాకు ఆ శ్రియఃపతి కనువిప్పు కలిగించాడు. ప్రభువుకు లేని భేదభావం దాసుడి కెందుకు?"

"డబ్బేమయినా కావాలా?"

"నువ్వు ఇప్పటికే ఎంతో పంపావు. అవసరంలేదు."

ఆరోజు సాయంత్రం గోదావరీ తీరంలో కళ్ళనీళ్ళతో కాలుతున్న తల్లి కట్టె వంక చూస్తూ నుంచున్నాడు ధర్మరాజు. అంతిమ యాత్రకొచ్చిన గ్రామస్థులు గోదావరిలో స్నానం చేస్తున్నారు.

"ఏం నిష్టురజీవితం ఇది. నివురు కప్పుకుపోయిన అగ్గి ఆమె ప్రేమ. సహజ వాత్సల్యం, కన్నకడుపు తీపిని కప్పేస్తూనే పోయింది నివురు. కన్నకొడుకులా పెంచిన బాబయ్య మోసం చేశాడు. జీవన సూత్రానికి మూలమైన నాయన పోయే. తండ్రి గండంతో పుట్టిన కొడుకున్న మూఢభావన. ఆర్థిక దుస్థితి. బూడిద కప్పుకుంటూనే పోయింది. తెలివి కలిగింది. చేసిన తప్పిదం ఆత్మగ్లాని కలిగించింది. అది జీవితమంతా వంచిస్తూనే ఉంది. తమ నమ్మిన విశ్వాసాల ఖాతరు కొడుక్కులేదు. అందుకే చాచిన వాత్సల్యపు చేతిని నిర్ద యగా వెనక్కి తీసేసుకుంది. జైల్లో నానాభ్రష్టపు కూడు తిన్న కొడుకు ప్రాయశ్చిత్తం చేసు కోడు. అలాంటివాడిని ఎలా పిలవాలి. ఇంట్లోకి ఎలా రానివ్వాలి. ప్రేమతో శాసించే అధికారం ఎప్పుడో పోయింది. ఆపైన కులాంతర వివాహం. ఏడేడుతరాల పూర్వ వంశీ కులు శ్రాద్ధపిండాన్ని ఎలా ఆరగించగలరు?" అన్నాడు శ్రీధరస్వామి విషణ్ణంగా తమ్ముడి భుజంమీద చేయివేసి.

ధర్మరాజుకు దుఃఖంతో మాట పెగలలేదు.

"మరి వెళ్దామా, అయ్యవారూ!" అన్నాడో గ్రామస్థుడు.

శ్రీధరస్వామి, ధర్మరాజు గోదావరిలో స్నానంచేసి ఇంటిదారి పట్టారు. తోవలో అన్నాడు శ్రీధరస్వామి.

"కర్మకాండ పూర్తయ్యాకనే వెళ్దువుగానీ. నీ పిల్లలు అమెరికాలో ఉన్నారని వింటిని. అక్కడ హైదరాబాద్‌లో మాత్రం నీకు పనేముంది. మన ఇంట్లోనే ఉండండి ఇద్దరూ. నువ్వింక డబ్బు పంపాల్సిన పనిలేదు. దేవళంలో తిరునాథుడి సేవలో నాకూ మీ వదినెకూ మంచిగనే కాలం గడిచిపోతున్నది. ఇంతకాలమూ ఆరాటపడుతూనే ఉంటిని. నివురు కప్పుకుంటూనే ఉంటిని. జీవన జాడ్యపు నివురు వదలకుండె. ఆశ్రియఃపతికెప్పుడు కరుణ కల్గునో."

'విపుల', నవంబర్ 2000.